క్లుప్తంగా

మున్సిపల్ దుకాణం సీజ్

పెడన: మహాత్మగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్ పరిధిలో గత కొన్ని నెలలుగా అద్దె చెల్లించని కారణంగా ఒక షాపును మున్సిపల్ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఆర్‌ఐ రాజేశ్వరరావు మాట్లాడుతూ అద్దె బకాయిలు బాగా పేరుకుపోవడంతో దుకాణాన్ని సీజ్ చేశామన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా మున్సిపల్ దుకాణాలు దక్కించుకున్న వారు చెల్లించాల్సి ఉందన్నారు. మున్సిపల్ మేనేజర్ ఎం.రాజా, మున్సిపల్ ఉద్యోగులున్నారు.

వృద్ధుడి నేత్ర దానం



నాగాయలంక: గ్రామంలోని పదో వార్డుకు చెందిన మండవ రంగారావు(85) అనారోగ్యంతో శనివారం మరణించారు. ఆయన నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. తన తండ్రి నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి చూపు వచ్చే అవకాశం కలుగుతుందనే సంకల్పంతో ఆయన భార్య సరోజిని, కుమారులు బసవారావు, సుధాకర్‌బాబు స్వచ్ఛంద నేత్ర దానానికి ముందు కొచ్చారు. స్థానిక మోటివేటర్స్ తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణ సహకారంతో కంటి ఆసుపత్రి ఐ టెక్నీషియన్ మహేష్ వచ్చి మృతుని నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

చల్లపల్లి: పంటలకు అవసరమైన మేర ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన పంట దిగుబడులను సాధించవచ్చని ఎంఏవో కె.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండల పరిధిలోని పురిటిగడ్డలో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఈక్రాప్ చేసుకోని రైతులు వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు నాగబాబు, సత్యదేవ్, రేవతి, రైతులు పాల్గొన్నారు.

7న చలో విజయవాడ

మచిలీపట్నంఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు అక్టోబర్ 7న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్, కార్యదర్శి అంబటిపూడి సుబ్రహ్మణ్యం, కె.రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హక్కులు, సమస్యల సాధనకై చేపట్టిన పోరాటంలో ఉపాధ్యాయులంతా ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జేసీని కలిసిన పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్‌సీహెచ్ నరసింహులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా చిననరసింహులును జేసీ శాఖకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఇప్పటివరకు 2.50 లక్షల పశువులకు ఈ టీకాలు వేశామని చిననరసింహులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు.

యువకుల రక్తదానం

అవనిగడ్డ: అవనిగడ్డ రెవెన్యూ హాలుతో శనివారం వైద్య ఆరోగ్య శాఖ, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులను పలువురు అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎ.వెంకట్రావు, నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ తుంగల వెంకటగిరి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనీల వీరబాబు, డాక్టర్ మహేష్, డాక్టర్ రియాజ్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ వంగర శేషగిరి, గరికపాటి హరిప్రసాద్, కోడూరు శ్రీను, సామర్ల మల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యులకు సన్మానం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వైద్యులు సమయస్ఫూర్తితో డెలివరీలు బాగా చేస్తున్నందుకు వైద్య బృందాన్ని ఎంపీపీ రావి దుర్గావాణి అభినందించారు. మండలంలోని పెదకళ్లేపల్లి పీహెచ్‌సీలో హాస్పటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ ఏడాదిలో మోపిదేవి పీహెచ్‌సీలో 4, పెదకళ్లేపల్లి పీహెచ్‌సీలో 3 డెలివరీలు చేశారని కొనియాడారు. పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు శ్రీ రాంసాయి మాట్లాడుతూ మోపిదేవి పీహెచ్‌సీ ప్రభుత్వం ఆగస్టులో మంజూరు చేసిన రూ.60 వేలు సకాలంలో మొత్తం ఖర్చు చేయనందును మిగిలిన నగదు రూ.30 వేలు వాపస్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో చర్చించిన అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. డెలివరీలు బాగా చేసిన వైద్యులను సత్కరించారు. గ్రామ సర్పంచ్‌లు అరజా సంధ్యారాణి, తుమ్మా సోములమ్మ, తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎంపీడీవో జె. స్వర్ణభారతి, మోపిదేవి, పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ లక్ష్మీనాథ్, డాక్టర్ అర్షియా సుల్తానా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగమేలు జగజ్జననికి జేజేలు!



లలితాత్రిపుర సుందరీదేవిగా విశ్వనాథపల్లి నాంచారమ్మ



అవనిగడ్డ గీతా మందిరంలో పట్టు వస్త్రాలతో అమ్మవారు



నాగాయలంక నగరేశ్వరుని ఆలయంలో



బందరులో సంతానలక్ష్మీదేవిగా కన్యకా పరమేశ్వరి



జానకీరామపురం సుబ్రహ్మణ్యస్వామి గుడిలో..

మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జగమేలే జగజ్జననికి భక్తజనం జేజేలు పలుకుతున్నారు. ఉత్సవాల్లో ఆరవ రోజైన శనివారం అమ్మవార్లు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కోడూరు: కోడూరులోని గంగాభవానీ, కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో కుంకుమార్చన నిర్వహించారు. గంగాభవానీ అమ్మవారు హంసవాహినీగా, కనకదుర్గమ్మ అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. విశ్వనాథపల్లి, మందపాకల అద్దంకి నాంచారమ్మ, మాచవరం తుంగపల్లెమ్మ, లింగారెడ్డిపాలెం బాలా త్రిపుర సుందరీదేవి, యాళ్లమ్మ, కోడూరు పార్వతిదేవి, దానా శక్తి, ఉల్లిపాలెం రాజ్యలక్ష్మి, హంసలదీవి కాశీ అన్నపూర్ణాదేవిఆలయాల్లో ఉత్సవాలు కొనాసగుతున్నాయి.

బంటుమిల్లి: స్థానిక కనకదుర్గనగర్‌లో కనకదుర్గ ఆలయం, పాశ్చాపురం శ్రీసువర్చలాంజనేయ స్వామి, జానకీరా మపురం, నాగేశ్వరరావుపేట, మల్లేశ్వరం కోదండ రామాలయంల్లో అమ్మవార్లను లతాత్రిపురసుందరీదేవీగా, పెదతుమ్మిడి శివాలయంలో అన్నపూర్ణాదేవీ అలంకారాల్లో పూజలు అందుకున్నారు. సీతారామ చంద్రస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మీదేవీగా, పద్మావతి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీ ధాన్యలక్ష్మీదేవీగా అలంకరించారు. పెందుర్రు, ముంజులూరు, రామవరప్పు మోడి, మల్లంపూడి గ్రామాల్లో పూజలు నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజలు చేశారు.

నాగాయలంక: స్థానిక కన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీలలితా త్రిపురసుందరి హోమం నిర్వహించారు. కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రంలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో పూజ జరిపారు. గణపేశ్వరంలో శ్రీదుర్గా-గణపేశ్వర స్వామి ఆలయాలలో దుర్గమ్మను శ్రీకాత్యాయనిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భావదేవరపల్లిలో శ్రీఅన్నపూర్ణ దేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సందరి అలంకారం చేశారు.

అవనిగడ్డ: మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవారు గజలక్ష్మీ దేవి లంకారంలో దర్శనమిచ్చారు. రాజశేఖరస్వామి ఆలయం, లంకమ్మ అమ్మవారి ఆలయం, వేకనూరు, పులిగడ్డలోని కనకదుర్గ ఆలయాల్లో గజలక్ష్మీ అమ్మవారిగా దర్శనమిచ్చారు. అవనిగడ్డ గీతా మందిరంలో అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు.

గూడూరు: స్థానిక గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వా ఆలయంలో ఇష్ట కామేశ్వరి దేవిగా, ఐదుగుళ్లపల్లిలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, గూడూరులోని మాధవస్వామి దేవస్థానంలో అమ్మవారు లలితా త్రిపుర సందరీదేవిగా దర్శనమిచ్చారు. తరకటూరులోని ఆలయంలో అమ్మవారు మంగళ గౌరీ దేవిగా దర్శనమించ్చారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలో దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గాదేవిగా అలంకరించారు. కొక్కిలిగడ్డలో శ్రీ గంగా భ్రమరాంబ అమ్మవారు, మోపిదేవి శ్రీ సకలేశ్వర స్వామివారి దేవస్థానం, కె.కొత్తపాలెంలో దుర్గా కోటేశ్వరస్వామివారి ఆలయంలోనూ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శినమిచ్చారు. కొక్కిలిగడ్డ భ్రమరాంబ ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు.

చల్లపల్లి: లక్ష్మీపురంలో శ్రీదుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామావారి ఆలయంలో శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు.

కృత్తివెన్ను: స్థానిక శివాలయం, అడ్డపర్ర, నీలిపూడిలో శనివారం అమ్మవారు శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గరిశపూడి, చిన పాండ్రాక, లక్ష్మీపురం, పోడు, పల్లెపాలెం,చినగొల్లపాలెంలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

పెడన: పైడమ్మ అమ్మవారిని శ్రీలలితాదేవిగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్‌లో

మచిలీపట్నంటౌన్: నగరంలో ఆజాద్ రోడ్‌లోని కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి శ్రీ సంతానలక్ష్మీ దేవిగా, శ్రీ పార్వతీదేవి శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ అధ్యక్ష కార్యదర్శులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్ పర్యవేక్షించారు. బుట్టాయిపేటలోని దత్తాత్రమంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, ఈడేపల్లిలోని శక్తిగుడిలో అమ్మవారు కాళికాదేవిగా, రాజుపేటలోని భ్రమరాంబ సమేత రాజమౌలేశ్వర స్వామి ముచ్చం గుడిలో అమ్మవారు శ్రీ సంతానలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. రేవతి సెంటర్లోని గంగానమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారు శ్రీ లలితాత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు.



బందరు బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అన్నపూర్ణాదేవిగా



పెదకళ్లేపల్లిలో లలితా త్రిపుర సుందరీదేవిగా..



ఐదుగుళ్లపల్లిలో లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



పెడన కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన



కృత్తివెన్ను శివాలయంలో లలితా త్రిపురసుందరీదేవిగా..



లక్ష్మీపురంలో శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

పెడన: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని, అందుకు తగ్గ విధంగా దుకాణాల్లో అధిక ధరలకు వస్తువులను, తినుబండారాలను కొనుగోలు చేయకుండా తగ్గిన ధరలకు కొనుగోలు చేయాలని డ్వాక్రా మహిళలకు గుడివాడ కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.రంగమణి సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని డ్వాక్రా మహిళలకు, బుక్‌కీపర్లకు జీఎస్టీ తగ్గిన వస్తువుల వివరాల బుక్‌లెట్‌లను అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ దుకాణాల్లో వస్తువులను తగ్గిన ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాలకు వెళ్లిన సమయంలో వారు తగ్గించిన ధరలకు విక్రయిస్తున్నారా లేక అధిక ధరలకు విక్రయిస్తున్నారో గమనించి తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కమర్షియల్ టాక్స్ ఏటీఈ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఎ.అరుణకుమారి, వెలుగు ఏపీఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గం ప్రత్యేక అధికారి పి.సాయిబాబు ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ఎం.స్వరూపరాణి జీఎస్టీ సూపర్ సేవింగ్స్ విధానాలు, అంశాలను వివరించారు. తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్, ఎంఈఓ ఎస్.శ్రీకాంత్, మండల పరిషత్ ఏఓ ఎం.చంద్రశేఖర్, పలువురు మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ, వెలుగు ఉద్యోగులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేతపై పోలీసులకు ఫిర్యాదు

చల్లపల్లి: మండలంలోని పురిటిగడ్డ పంచాయతీ శివారు నిమ్మగడ్డలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి కోసి చించివేశారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పురిటిగడ్డ, నడకుదురు సర్పంచులు మాతంగి రమ్య, గౌరిపర్తి సురేష్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, ఎస్సీ సెల్ నాయకులు జుజ్జువరపు భాగ్యారావు, కృష్ణంరాజు, లక్ష్మణ, మురళి, నాంచారయ్య ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ప్రశాంతంగా ఎస్‌బీఐ ఆన్‌లైన్ పరీక్ష

పెడన: ఎస్‌బీఐలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం శనివారం మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల సెంటరులో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. నాలుగు షిఫ్టులకు 710 మంది అభ్యర్థులకు గాను 507 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవ్వగా 203 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్‌ఎస్ రెడ్డి, సెంటర్ అడ్మిన్ పి. అశోక్‌కుమార్ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు వారు తెలిపారు.

పశుపోషణతో ఆర్థికాభ్యున్నతి



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఏడీ సాంబశివరావు

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక ఎంవీకే రావు గ్రామ వికాస సమితి, మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలి వెంకట కృష్ణారావు 28వ వర్ధంతి పురస్కరించుకుని మండలంలోని భావదేవరపల్లి గ్రామంలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం ప్రారంభించిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పోషణ కొనసాగించి ఆర్థిక సమృద్ధి పొందలని పేర్కొన్నారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన పశు వైద్యులు 16 మందిని వెనక్కి రప్పించామన్నారు. శిబిరానికి 52 మంది రైతులు వైద్య పరీక్షల కోసం తమ పశువులను తీసుకొచ్చారు. మినరల్ మిక్చర్, కాల్షియం, వాతపు పొడి, నట్టల నివారణ మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరక్టర్ సాంబశివరావు, మండలి వెంకట్రామ్, సర్పంచి మండలి ఉదయభాస్కర్, డీజీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు, పశు వైద్యాధికారులు డాక్టర్ రాధిక (డీఎల్‌డీఏ-గన్నవరం), డాక్టర్ షఫి, నాగార్జున, మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ సీహెచ్ సాయిమౌనిక తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: స్థానిక పశువైద్యశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వాటికి ఉచితంగా టీకాలు వేశారు.

బాలకృష్ణ తక్షణమే చిరంజీవికి క్షమాపణ చెప్పాలి

అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ నాయకుల డిమాండ్

అవనిగడ్డ: శాసన సభలో హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి మాట్లాడిన మాటలను తక్షణం వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని అఖిల భారత చిరంజీవి యువత అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు సిద్ధినేని అశోక్ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత్రికేయులతో ఆశోక్ నాయుడు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి అంచలంచెలుగా ఎదిగి సినీరంగంలో మెగాస్టార్‌గా వెలుగొందుతున్నారని, రాజకీయాల్లో కూడా ఎటువంటి మచ్చ లేకుండా పనిచేసిన వ్యక్తని, బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్, కరోనా సమయంలో కోట్లాది రూపాయలతో ఆక్సిజన్ సిలిండర్లను అందించిన గొప్ప సేవా తత్పరుడని, అటువంటి చిరంజీవిని బాలకృష్ణ శాసన సభ సాక్షిగా అవమానించటం దారుణమన్నారు. సినీ పరిశ్రమ బాగుకోరే చిరంజీవిని విమర్శించటం చాలా బాధాకరమని అన్నారు. నియోజకవర్గం చిరంజీవి యువత అవనిగడ్డ టౌన్ అధ్యక్షుడు అల్లంశెట్టి మురళి, తోట దామోదరరావు, రేపల్లె సత్యానంద్, రెడ్రౌతు సుబ్బయ్య ఉన్నారు.

కాపులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలి

తలగడదీవి(నాగాయలంక): రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన కాపులకు ఉచిత గృహ విద్యుత్ పథకం అమలు చేయాలని రాష్ట్ర కాపునాడు అవనిగడ్డ నియోజకవర్గం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ (చిన్నారి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తలగడదీవిలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధానమైన కాపులలో ఇప్పటికీ అత్యధిక శాతం మంది అట్టడుగు జీవితాలనే అనుభవిస్తున్నారని అన్నారు. అయినా ఈ వర్గాలకు పథకాల అమలులో మేలు జరగడంలేదన్నారు. సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కాపుల సమస్యలపై దృష్టి సారించాలని, మండలాల స్థాయిలో కల్యాణ మండపాలు, కాపు కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

అపార్ ఐడీలు నమోదు చేయాలి

ఘంటసాల: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 3- 6 సంవత్సరాల ప్రీ స్కూల్ చిన్నారులకు అపార్ ఐడీలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఐసీడీఎస్ మొవ్వ సీడీపీవో ఎస్.ప్రసన్న విశ్వనాథ తెలిపారు. స్థానిక నందం బజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘంటసాల సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ప్రసన్న విశ్వనాథ మాట్లాడుతూ నమోదు చేసి ఐదేళ్ల దాటిన చిన్నారులకు విద్యారంబ్ ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) సర్టిఫికెట్లను అందించాలన్నారు. ఘంటసాల సెక్టార్ సూపర్ వైజర్ టి.రమానాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు



కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు పీపీపీ పద్ధతిన కట్టబెట్టేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పల్లపోతు అంకబాబు కోరారు. కలెక్టర్ డీకే బాలాజీకి కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం వినతిపత్రం అందజేశారు. అంకబాబు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి తద్వారా సామాన్యులకు వైద్యవిద్యను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారన్నారు. 2019- 24 మధ్య కాలంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. మచిలీపట్నం, విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల కళాశాలల్లో తరగతులు కూడా ప్రారంభించబడ్డాయని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కళాశాలల ప్రైవేటీకరణకు టెండరు నోటిఫికేషన్ విడుదల చేసిందని ఇందుకోసం తొలివిడతలో నాలుగు మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. టీడీపీకి చెందిన పారిశ్రామికవేత్తలకు కళాశాలలను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, దీని వల్ల వైద్య విద్య పేద విద్యార్థులకు దూరమవుతుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్యవిద్యను అందించేందుకు ప్రభుత్వం కళాశాలలను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో లీగల్‌సెల్ నాయకులు జక్కుల ఆనంద్‌బాబు, కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, కమ్మగంటి చంద్రశేఖర్, మురాల వెంకటేష్, మట్టా రాందాస్, మోచర్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయండి



ఈ క్రాప్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్, ఏవో జెన్నీలు

పెడన: అశ్రద్ధ చేయకుండా ఈ క్రాప్ వేగవంతంగా నమోదు చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ వీఏఏ, వీఆర్వోలను ఆదేశించారు. శనివారం ఆయన పెడన పట్టణ పరిధిలోని పంట పొలాలతో పాటు నడుపూరు గ్రామంలో ఈ క్రాప్‌ను ఎంఏవో ఎస్ జెన్నీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 20 వేల ఎకరాలకు పైగా వరి సాగు అవుతుందని, ఇందులో సుమారు 13,500 వరకు ఈ క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన 35 శాతంలో ఐదు శాతం నేరుగా ఈ క్రాప్‌లోకి వచ్చేశాయని, మిగిలిన 30 శాతం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని వీఏఏ, వీఆర్వోలను ఆదేశించామన్నారు. మండల పరిధిలో చేవేంద్ర గ్రామంలో ఈ క్రాప్ వెనుకబడిందని, అక్కడ వీఏఏ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఇన్‌చార్జి బాధ్యతలను మరొకరికి అప్పగించి, ఈ క్రాప్ వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరితో వీఏఏలు, వీఆర్వోలు ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



ఎన్‌ఎంఎంఎస్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): నేషనల్ మీన్స్ కం మెరిట్స్ స్కాలర్‌షిప్‌కు సంబంధించి తయారుచేసిన మెటీరియల్‌ను కలెక్టర్ డీకే బాలాజీ కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం ఆవిష్కరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.శ్రీనివాసరావు తయారు చేసిన మెటీరియల్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎన్ఎంఎంఎస్‌కు సంబంధించి డిసెంబరు 7న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులందరూ ఈ పరీక్షకు హాజరవుతారన్నారు. వారి కోసం ఈ మెటీరియల్‌ను తయారుచేశారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్ అందుతుందని కలెక్టర్ వివరించారు. భారతీయ విద్యామండలి ఏపీ సైన్స్ సిటీ, అప్ కాస్ట్ సమిత్ ఆధ్వర్యంలో నిర్వహించబడే కౌశల్- 2025 (సైన్స్ క్విజ్ పోటీలు, పోస్టర్ కాంపిటేషన్)కు సంబంధించి వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ బాలాజీ ఆవిష్కరించారు. ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఈవో పీవీజే రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసిన అధికారులు



మున్సిపల్ వాటర్ పరీక్షలను పరిశీలిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

పెడన: పట్టణంలో నడుస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్లను మున్సిపల్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంట్ల నిర్వహణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా వారికి హెచ్చరికలు జారీ చేశారు. ట్రేడ్ లైసెన్సులు తీసుకోకుండా నడపడానికి వీల్లేదని తక్షణం ట్రేడ్ లైసెన్సులకు దరఖాస్తు చేయాలని సూచించడమే కాకుండా తాగునీటిని పరీక్షల నిమిత్తం గుంటూరు ల్యాబ్‌కు తరలించారు. మున్సిపల్ ఏఈ కె.సీతారామాంజనేయులు మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ప్రతి మూడు నెలలకు లేదా ప్రతి ఆరు నెలలకు వాటర్ టెస్ట్ చేయించి నివేదికలు ఉంచుకోవాలన్నారు. ఎవరైనా తనిఖీలకు వచ్చిన సమయంలో వాటిని చూపించాల్సి ఉంటుందని, కానీ ఇవేమీ లేకుండా వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తున్నారన్నారు. ఈయనతో పాటు వార్డు సచివాలయాలకు చెందిన ఎమినిటీలు ఉన్నారు. తొలుత మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి కొత్తగా కొనుగోలు చేసిన టీడీ మీటర్, ఫ్లోర్ స్కోప్, హెచ్2ఎస్ బ్యాక్టీరియల్ టెస్టింగ్ పరికరాలతో మున్సిపల్ వాటర్‌ను పరిశీలించారు. మున్సిపల్ వాటర్‌ను కూడా గుంటూరు ల్యాబ్‌కు పంపించి పరిశీలించేలా చూడాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో ఆర్వో వాటర్ ప్లాంట్ల వద్ద తాగునీటిని కూడా పరిశీలించాల్సిందిగా సూచించారు. దీంతో మున్సిపల్ ఏఈ పట్టణంలో ఆర్వో వాటర్ ప్లాంట్లను పరిశీలించారు.

ఇంటర్ విద్యార్థులు లేకుండా చేయడంపై నిలదీత

ఘంటసాల: శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్ ప్లస్2లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు లేకుండా పోవడానికి ఉపాధ్యాయుల నిర్లక్ష్యమా, అధికారుల నిర్లక్ష్యమా అంటూ తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు అధికారులను నిలదీశారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేమూరి రజనీ కుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పై సమీక్షిస్తుండగా విద్యాశాఖ మీద మాట్లాడుతుండగా తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు స్పందిస్తూ ఘంటసాల మండలం శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్లస్ 2 ఏర్పాటు చేశారన్నారు. ఈ ఏడాది కూడా 16 మంది ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులు ఉంటే వారికి సెల్ఫ్ డిక్లేరేషన్ తీసుకుని హెచ్‌ఎం టీసీలు ఇచ్చి పంపించి వేశారని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను దూరం చేయడానికే ఈ విధంగా చేశారని ప్రసాద్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఎంఈవో- 2 మోమిన్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. యండకుదురు పంచాయతీలో కోతుల బెడద తీవ్రంగా ఉందని చెప్పినా పట్టించుకోవటంలేదని సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు అన్నారు. మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు ముగ్గురు డీఎస్సీలో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని ఎంపీపీ రజనీ కుమారి, జెడ్పీటీసీ మురళీ, ప్రజా ప్రతినిధులు అభినందించి సన్మానించారు. ముందుగా జెడ్పీ మాజీ చైర్మన్ దివంగత పిన్నమనేని కోటేశ్వరరావు, దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవి కుమార్ నివాళులర్పించాలని కోరగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళుర్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.